
సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న లోకేశ్, అచ్చెన్నాయుడు పుల్లారావు తదితరులు.



- అధికారపార్టీ ప్రచార పిచ్చికి ఉద్యోగులు బలి
- స్వామి కార్యంతోపాటు స్వకార్యానికీ తప్పని ఈకేవైసీ
- ప్రతి పథకానికి ఈ కేవైసీ కావాలంటూ ఆదేశాలు
- 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో లబ్ధిదారులకు లేఖలు
- దానికీ ఈ కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఛీ.. పొమ్మంటున్న లబ్ధిదారులు
- పలుచోట్ల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై దాడులు

అడ్డగోలు వాడకం!

గుంటూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ఒక వలంటీర్ ఆన్‌లైన్ ఆధార్ ఈ కేవైసీ కోసం ఒకరి ఫోనుకు ఓటీపీ పంపింది. ఆ ఓటీపీ చెప్పాలని ఆ నెంబరుకు కాల్ చేసింది. కాల్ లిఫ్ట్ చేసిన ఆ ఇంటి మహిళ తన భర్తకు పదేపదే ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ వలంటీర్‌తో గొడవకు దిగింది. వివాహేతర సంబంధం వుందంటూ ఆరోపణలు చేసింది. దీనిపై పంచాయతీ కార్యదర్శికి వలంటీర్ ఫిర్యాదు చేసింది. అతడు పట్టించుకోకపోవడంతో ఆ వలంటీర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయింది. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. ఈ కేవైసీల కోసం పదేపదే ఫోన్లు చేయడం, వేలిముద్రల కోసం పదేపదే ఇళ్లకు వెళ్లడం వంటి కారణాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక మూల ఇలాంటి ఘటనలు జరుగుతూనే వున్నాయి.

అవమానాల పాలవుతున్న ఉద్యోగులు, వలంటీర్లు

అధికార వైసీపీ ప్రచార పిచ్చి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు లేనిపోని తిప్పలు తెస్తోంది. ఉద్యోగం, ఉపాధి మాట ఎలా వున్నా సమాజం లో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ అడ్డగోలు వాడకం కారణంగా వారికి అవ మానాలే మిగులు తున్నాయి. సమాజంలో అనేక చీత్కారాలకు గురవుతున్నారు. వారి వ్యక్తిగత జీవితంపైనే ముద్ర వేయించుకునే పరిస్థితి వస్తోంది. సంక్షేమ పథకాలతోపాటు సొంత ప్రచారానికి కూడా వారిని వాడేస్తుండడంతో ప్రజల్లో వలంటీర్లు, సచివాల య ఉద్యోగులంటే చీత్కార భావం కలు గుతోంది.

స్వకార్యానికి కూడా ఈ- కేవైసీ

సంక్షేమ పథకాల పేరుతో పదుల సంఖ్యలో ఈ- కేవైసీ చేయిస్తున్న ప్రభుత్వం అవి చాలవన్నట్లు సొంత ప్రచారానికి కూడా ఈ కేవైసీ చేయించాలని డిమాండ్ చేస్తోంది. 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో ముఖ్యమంత్రి పేరుతో వచ్చిన లేఖను లబ్ధిదారుల ఇంటికి చేర్చి వారితో ఈ కేవైసీ చేయించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై లబ్ధిదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు పొందిన సంక్షేమ ఫలాలతో ఎలాంటి సంబంధం లేని తప్పుడు లెక్కలతో ఈ లేఖలు ఉండడంతో లబ్ధిదారులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఛీ.. పొమ్మంటున్నారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులతోపాటు, అధికార వైసీపీ నేతలు కూడా వలంటీర్లు, ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారులను అదేస్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు వారికి ఎదురు తిరిగుతున్నారు. పలుచోట్ల దాడులకు కూడా దిగుతున్నారని వలంటీర్లు వాపోతున్నారు. ఇదిలా వుండగా, రేపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత తమ పరిస్థితి ఏమిటా.. అని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి పథకానికి ఈ- కేవైసీ

ప్రభుత్వం తాను అమలు చేస్తున్నానన్న ప్రతి పథకానికి ఈ కేవైసీని తప్పనిసరి చేసింది. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసినందుకు, ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేసినందుకు, ఇళ్ల పట్టాలు పంపిణీకి, పాలవెల్లువ సర్వేకు, క్యాస్ట్ సర్వేకు.. ఇలా ప్రతిదానికీ ఈ కేవైసీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇది క్షేత్రస్థాయిలో పనిచేసే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అనేక సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ కేవైసీ వేలిముద్రల కోసం వలంటీర్లు ఇళ్లకు వెళుతుండడంపై గృహిణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటీపీ ద్వారా ఆన్‌లైన్ ఈ కేవైసీ కోసం వలంటీర్లు సంబంధిత మొబైల్ నెంబర్లకు ఓటీపీలు పంపుతున్నారు. అవి తెలుసుకోవడానికి పదే పదే ఫోన్లు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పదే పదే ఇళ్లకు వెళ్లడం, ఫోన్లు చేయడంపై వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారేమీ పట్టించుకోవడం లేదు. మాకు అవన్నీ అనవసరం ఈ కేవైసీ కావాల్సిందేనని పట్టు పడుతున్నారు. దీంతో వారు ఇరువైపులా నలిగిపోతున్నారు.

ఇవ్వని పథకాలు ఇచ్చినట్లుగా..

వలంటీర్లపై మండిపడుతున్న ప్రజలు



గడప గడపకు సంక్షేమం పేరుతో స్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్టు ఇచ్చిన తప్పుడు పత్రం

ప్రత్తిపాడు: మా ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి వచ్చిన లబ్ధి ఇది అంటూ ఇస్తున్న పత్రాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రెండు రోజులుగా వలంటీర్లు ఇంటింటికి వచ్చీ లబ్ధి వివరాలతో కూడిన పత్రాలను కుటుంబ యజమానులకు అందజేసి వారి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అయితే ఆయా పత్రాలు చూసుకున్న చాలామంది తమకు ఆ పథకాల లబ్ధి అందలేదని వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండానే స్థలాలు ఇచ్చినట్లు, అమ్మఒడి ఒక్కసారి పడితే రెండు సార్లు అందుకున్నట్లు, రైతు భరోసా పడకుండానే పడినట్లు, సున్నా వడ్డీలో తప్పులు, వైద్యశాలకు వెళ్లకుండానే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నట్లు.. ఇలా పలు తప్పుడు లెక్కలు, లబ్ధిలో హెచ్చులు కనిపిస్తుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వలంటీర్లు పంపిణీ చేసిన గడప గడపకు సంక్షేమం పత్రాలలో ఇలాంటి తప్పులు కో కొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. ఈ తప్పుల విషయంలో అధికారులు నోరు మెదపడంలేదు. ప్రత్తిపాడులో చెర్లోపల్లి బుల్లెమ్మాయికి రూ.2 లక్షల విలువైన ఇంటి స్థలం వచ్చినట్లుగా పత్రం అందజేశారు. అయితే ఆమెకు స్థలం ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు కూడా ధృవీకరిస్తున్నారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తమకు స్థలం ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా పత్రంలో నమోదు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. పెదనందిపాడుకు చెందిన ఎం శ్రీనివాసరావు అనే వ్యక్తికి ఆరోగ్య శ్రీ ద్వారా రూ.60 వేలు లబ్ధి పొందినట్లు పత్రం ఇచ్చారు. అయితే తాము ఇంతవరకు వైద్యశాలకు వెళ్లలేదని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకోలేదని, అలాంటప్పుడు రూ.60 వేలు ఎటు వెళ్లాయని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే మరో బాలికకు ఒక్క సారి మాత్రమే అమ్మఒడి అందగా వలంటీర్లు ఇచ్చిన పత్రంలో రెండు సార్లు అందుకున్నట్లు ఉండటంతో వారు విస్తుపోతున్నారు. లబ్ధి అందుకోకపోయినా తప్పుడు పత్రాలతో వేలిముద్రలు వేయించుకోవడం ఏమిటని పలువురు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమరానికి సై

- బొప్పూడి వద్ద భారీ బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు
- సభా ప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేసిన కూటమి నేతలు
- ఏర్పాట్లు పరిశీలించిన నారా లోకేశ్ కూటమి నేతలు

చిలకలూరిపేట, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై సమరం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ తొలి ఉమ్మడి బహిరంగ సభ చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద భారీగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. సభా ప్రాంగణం నిర్మాణానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీజేపీ, జనసేన నేతలతో కలసి బుధవారం ఉదయం 9.32 గంటలకు భూమిపూజ చేశారు. జాతీయ రహదారి పక్కనే బొప్పుడి వద్ద 17న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. సభకు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాంతంలో రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ భూముల్లో ఉన్న పొగాకు తదితర పంటలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ రైతులకు నష్టపరిహారం చెల్లిస్తుంది. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో రాష్ట నలుమూలల నుంచి లక్షలాది మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను అప్పగించారు. మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తీసుకున్న మూడు పార్టీలు సుమారు 15 లక్షల మంది జనసమీకరణకు ప్రణాళికలు రచించారు. ఈ బహిరంగ సభ వేదికగా దేశానికి ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక సందేశం ఇవ్వబోతున్నారని కూటమి నేతలు పేర్కొన్నారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికి, ప్రజలను కష్టాల నుంచి బయటపడటానికి, రైతులు సంతోషం, ఆడబిడ్డలు క్షేమం, యువతకు భవిష్యత్తు ఇవ్వడానికి ఈ బహిరంగ సభ దిక్సూచిలా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, దేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, యడ్లపాటి రఘునాథ్ బాబు, వల్లూరి జయప్రకాష్, లంకా దినకర్, శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, మంతెన రామరాజు, పార్టీ సీనియర్ నేతలు జీవీ ఆంజనేయులు, పెందుర్తి వెంకటేష్, సత్యనారాయణరాజు, మూడు పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నవ శకానికి దిక్సూచిలా సభ: మాజీ మంత్రి ప్రత్తిపాటి

బొప్పూడి వద్ద జరగబోయే సభతో చరిత్ర సృష్టిస్తామని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సభ వైపు దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందన్నారు. ఎన్డీఏలో చేరిన తర్వాత తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి ఉమ్మడి మేనిఫెస్టో సభ నభూతో నభవిష్యత్ అన్నట్టుగా ఉంటుందన్నారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం తిరిగి ఎన్డీఏలో భాగస్వామ్యమైందన్నారు. మూడు పార్టీలు కూటమిగా పోటీచేయడం రాష్ట్రాభివృద్ధికి కొత్తబాటలు వేస్తాయన్నారు. కేంద్ర సహకారం లేనిదే రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణం చేయాలంటే తెలుగుదేశం- జనసేన- బీజేపీ పార్టీలు కలవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని పుల్లారావు తెలిపారు. బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ఎటువంటి అభివృద్ధి చేయకుండా లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా కూటమి పనిచేస్తుందన్నారు. జనసేన రాష్ట్రకార్యదర్శి కూడపాటి శివధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారమెత్తి యథేచ్ఛగా దోపిడీగా పాల్పడుతున్నారు.


సభా వేదిక ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న గడ్డర్లు




సభా ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మాణం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తమయ్యాయి.

ఏర్పాట్లపై లోకేశ్ సమీక్ష

రాష్ట్ర చరిత్రలో ఈ సభ నిలిచిపోయేలా నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. మూడు పార్టీల ముఖ్యనేతలతో ఏర్పాట్లపై లోకేష్ చర్చించారు. సభా ప్రాంగణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, హెలిప్యాడ్‌లు తదితర ఏర్పాట్లపై లోకేష్ నేతలతో చర్చించారు. లక్షలాదిగా ప్రజలు రానున్న సందర్భంగా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. సభా ప్రాంగణం వద్ద ప్రారంభమైన పనుల ను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. బీజేపీ పొత్తు కుదిరిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభను ప్రతిష్ఠాత్మకంగా

నాగులేరు.. నిండుకుంది

- నీటి జాడలులేక ఎండుముఖం
- బోర్ల నుంచి చుక్కనీరు రాని వైనం
- పంటలు గట్టెక్కేదెలా అని రైతుల ఆందోళన


నాగులేరు వాగు

పిడుగురాళ్ల, మార్చి 13: పల్నాడులో జీవనాడిగా పేరొందిన నాగులేరుకు వందల ఏళ్లనాటి చరిత్ర ఉంది. ఇప్పటిదాకా ఎప్పుడు కూడా నాగులేరు ఎండిన దాఖలాలు లేవు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నీరు తగ్గుముఖం పట్టి ఇప్పుడు ఎండిపోయింది. నాగులేరు ఇంతగా ఎండిపోవడం ఎవరూ చూసి ఉండరు. ఒక్క నాగులేరే కాదు.. ఎర్రవాగు, పిల్లేరు వాగు లాంటివి ఎన్నో ఇప్పుడు ఎండిపోయి కనిపిస్తున్నాయి. దీంతో పల్నాడు ప్రాంతంలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో రబీ సీజన్‌లోనూ రైతులు బోర్లు, బావుల నీటి ఆధారంగా కొందరు రైతులు వరిసాగు చేశారు. ఆది నుంచే అష్టకష్టాలు పడుతూ వరి సాగు చేసిన రైతులకు ఇప్పుడు నీరు పెద్ద సమస్యగా మారింది. ఆరుతడి పంటలకే సాగునీరు అని వ్యవసాయశాఖ విస్తృతంగా ప్రచారం చేయలేదు. దీంతో ఎప్పటిలాగే సాగునీరు వస్తుందన్న భరోసాతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా వరిసాగు చేపట్టారు. కొందరు పత్తి, మిరప సాగు చేయగా మరికొందరు రైతులు ఖరీఫ్ పంట పూర్తయ్యాక రబీలో కూడా వరి వేశారు. గత నెల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, సాగర్ జలాల సరఫరా లేకపోవడం, విద్యుత్ కోతల కారణంగా సాగులో ఉన్న వరి ఎండిపోయే దశకు చేరుకుంది. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటడంతో బోర్లు, బావుల్లో కూడా చుక్కనీరు రావడం లేదు. నెమలిపురి, శ్రీనివాస నగరం, బ్రాహ్మణపల్లి, వీరాపురం, జానపాడు, గుత్తికొండ ప్రాంతాల్లోని రైతులకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. దీంతో వరి చేతికందు తుందా లేదా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. సాగర్ ఆయకట్టు కు ఆరుతడిగానైనా ఒకటి, రెండుసార్లు నీటిని విడుదల చేస్తే పంటలు దక్కుతాయని లేకుంటే లక్షలు నష్టపోయే ప్రమాదం ఉంది.

సాగునీరు ఇవ్వకుంటే కష్టమే ..

రబీ సీజన్‌కు వాగులు ఎండిపోయాయి. బోర్ల నుంచి కూడా చుక్క నీరు రావడం లేదు. రబీ సాగులో వరి వేసిన రైతులకు మార్చి నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారం వరకు విడతల వారీగా అయినా సాగునీరు అందించాలి. లేకుంటే ఆర్థికంగా నష్టపోతారు.

\- యడ్లపల్లి శివ

సిద్ధంగా..బలగాలు

- ఎన్నికల బందోబస్తుకు కేంద్ర సాయుధ బలగాలు..
- జిల్లాకు 600 మంది కేటాయింపు
- ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు విచ్చేసిన కేంద్ర భద్రతా బలగాలకు రవిశంకర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల బందోబస్తుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. జిల్లాకు 600మంది కేంద్ర సాయుధ బలగాలు కేటాయించినట్టు వివరించారు. నరసరావుపేట పట్టణంలోని కళాశాల ఆవరణలో బలగాలతో ఆయన బుధవారం సమావేశమై జిల్లాలో ఎన్నికల సమయంలో వారు నిర్వర్తించాల్సిన విధులు, అవసరమైన మౌలిక వసతులపె ఎస్పీ చర్చించారు. తమతో పాటు ఎన్నికల విధులు నిర్వర్తించడానికి సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకు విచ్చేసిన వారికి అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు కోసం మనమందరం సమష్టిగా విధులు నిర్వహించి, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణ సమయంలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో సమన్వయం కలిగి, కేంద్ర బలగాలు వారికి సహకరించాలి, కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద, గ్రామాల్లో అనుకోని ఘటనలు ఎదురైతే వెంటనే పై అధికారులకు వాటిని తెలియజేయాలన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలపై కేటాయించిన సమన్వయ అధికారి ద్వారా పొందాలని సూచించారు. అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులతో కలసి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాలన్నారు. పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి టౌన్, అమరావతి, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో సీఐఎస్ ఎఫ్, బీఎస్‌ఎఫ్ బలగాలకు వసతి ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ నుంచి వారు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్స్ బరియాదేశ్ సింగ్, బన్సీధర్, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఎస్పీ సీఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

జగన్ చెప్పినా.. ససేమిరా

- అంబటి, గోపిరెడ్డిలను గెలిపించాలన్న జగన్
- అభ్యర్థులను మార్చాలని పట్టుబట్టిన అసమ్మతి వర్గం
- సిట్టింగ్‌లపై ఉన్న వ్యతిరేకతను సీఎంకు వివరించిన నేతలు

నరసరావుపేట, మార్చి 13: సత్తెనపల్లి, నరసరావుపేట వైసీపీ అభ్యర్థులను మార్చాలి.. వారు పోటీ చేస్తే ఓడిస్తాం.. అని తేల్చిచెప్పడమే కాకుండా వారికి వ్యతిరేకంగా అసమ్మతి నేతలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వారిపై తమ అసంతృప్తిని అధిష్ఠానానికి కూడా తెలియజేశారు. అయితే అసమ్మతిని ఖాతరు చేయని అధిష్ఠానం సత్తెనపల్లి, నరసరావుపేట అసెంబ్లీ స్థానాల్లో సిట్టింగ్‌లో పోటీ చేస్తారు.. వారినే గెలిపించాలని తేల్చిచెప్పింది. బుధవారం రెండు నియోజకవర్గాల పరిధిలోని నేతలు వైసీపీ అధినేత, సీఎం జగన్‌తో సమావేశమయ్యారు. సత్తెనపల్లి నుంచి మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తారు.. వీరి గెలుపు కోసం అందరూ కలిసి పని చేయాల్సిందే.. నన్ను చూసి వారి గెలుపు కోసం కృషి చేయాలి.. ఈసారికి వారి కోసం పని చేయాల్సిందేనని నేతలను జగన్ ఆదేశించారు. జగన్ నిర్ణయాన్ని స్వాగతించని నేతలు అభ్యర్థులను మార్చాల్సిందేనని చెప్పినట్లు వారి అనుచర వర్గం చెబుతున్నది. వారి కోసం తాము పనిచేయలేమని వివరించినట్లు తెలిపారు. జగన్ వ్యాఖ్యలపై ఆయన సమక్షంలోనే అసమ్మతి నేతలు అసంతృప్తిని వ్యక్తం చేశారని సమాచారం. ఈ ఒక్కసారికి అంబటి రాంబాబుకు సహకరించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని సీఎం వారికి చెప్పారని సమాచారం. నియోజకవర్గంలో అంబటి మీద ఉన్న వ్యతిరేకతను యర్రం వెంకటేశ్వరరెడ్డి, చిట్టా విజయభాస్కర్‌రెడ్డిలు సీఎంకు వివరించారని తెలిసింది. అయినా సరే ఈ ఒక్కసారి సహకరించమని సీఎం వారిని కోరారని సమాచారం. అయితే జగన్ తీసుకున్న నిర్ణయాన్ని అసమ్మతి నేతలు ఏమేరకు సమర్థిస్తారో చూడాలి. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి వ్యతిరేక వర్గంగా పేరొందిన డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, పిల్లి ఓబుల్‌రెడ్డి, షేక్ అనీఫ్, బ్రహ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, చల్లా శ్రీనివాసరావు, డాక్టర్ డాక్టర్ గజ్జల సుధీర్, భార్గవ్‌రెడ్డి జగన్‌తో జరిగిన భేటీలో పాల్గొన్నారు. మరో వైపు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కూడా హాజరయ్యారు. సత్తెనపల్లి నియోజకవర్గ నుంచి అంబటి వ్యతిరేక వర్గంగా పేరొందిన నాయకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డిలు సీఎంను కలిసి మాట్లాడారు.

సీఎం జగన్‌ను కలిసిన నరసరావుపేట నేతలు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.23 (గురువారం)
సహరీ (ఉదయం) 5.00 (శుక్రవారం)

ఎన్‌సీహెచ్‌ఎంసీటీలో ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్



నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్‌ఎంసీటీ)- ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా 17 ఐహెచ్‌ఎంలు ఉన్నాయి. డైరెక్ట్ అడ్మిషన్స్, ఎమ్మెస్సీ జేఈఈ 2024 కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. డైరెక్ట్ అడ్మిషన్స్‌కు అకడమిక్ మెరిట్ ద్వారా ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు కేటగిరీలకు అప్లయ్ చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి 'జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)' పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ లేదా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నుంచి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌ను కనీసం 55 శాతం మార్కులతో పూర్తిచేయడానికి తోడు త్రీ స్టార్ హోటళ్లలో రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారికి డైరెక్ట్ అడ్మిషన్ ఇస్తారు. కేవలం హాస్పిటాలిటీ సహా ఏదేని విభాగంలో డిగ్రీ పూర్తిచేసినవారికి ఎమ్మెస్సీ జేఈఈ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎమ్మెస్సీ జేఈఈ వివరాలు: దీనిని సీబీటీ/ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, హాస్పిటాలిటీ ఆప్టిట్యూడ్ జనరిక్, జనరల్ హోటల్ ఆపరేషన్స్, కరెంట్ అఫైర్స్/జనరల్ నాలెడ్జ్, సస్టయినబుల్ టూరిజం అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, అప్రిసియేషన్ ఆఫ్ కల్చరల్ డైవర్సిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు; కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్ అండ్ న్యూమరిక్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు.

దిక్సూచి DIKSUCHI

- **డైరెక్ట్ అడ్మిషన్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; జనరల్ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డైరెక్ట్ అడ్మిషన్స్‌కు ఏప్రిల్ 15; ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఏప్రిల్ 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 10 నుంచి
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.nchm.gov.in

నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఎల్‌ఐఎస్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్‌ఎల్ఐయూ)- మాస్టర్ ఆఫ్ సైబర్ లా అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(ఎంసీఎల్‌ఐఎస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ నేషనల్ సైబర్ లా సెంటర్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా నిర్వహించే రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: రీసెర్చ్ మెథడాలజీ, సైబర్ ఎన్విరాన్‌మెంట్, సైబర్ లా, క్రిప్టోగ్రఫీ-నెట్‌వర్క్ సెక్యూరిటీ, ప్రైవసీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ సైబర్ స్పేస్, మొబైల్ వైర్‌లెస్-సెక్యూరిటీ, బిజినెస్ ప్లానింగ్-ఆడిట్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ లా, క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీ అండ్ లా కోర్సులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 30, ఎస్టీలకు 12, ఎస్సీలకు 10, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 6 సీట్లు కేటాయించారు. అన్ని కేటగిరీల్లో 50 శాతం సీట్లను స్థానికులకు(మధ్యప్రదేశ్ వాసులు) ప్రత్యేకించారు. మహిళలకు 18 సీట్లు, దివ్యాంగులకు 3 సీట్లు నిర్దేశించారు. విదేశీ విద్యార్థుల కోసం అదనంగా అయిదు సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.


ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, కంప్యూటర్ నాలెడ్జ్, సైబర్ సెక్యూరిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు ఉంటాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మే 12
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 12, 13, 14
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5H4Efc8లో
చదవండి.

రైల్వేలో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీలు: 9144



దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్‌ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: **1,092 పోస్టులు**
2. టెక్నీషియన్ గ్రేడ్-3: **8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్‌ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/వైర్‌మ్యాన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంది.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

సమ్మర్ ఇంటర్న్‌షిప్

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టయిపెండ్: ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024:** మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఈ-మెయిల్:** research@iittp.ac.in
- **వెబ్‌సైట్:** www.iittp.ac.in

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నా



రాజమౌళి

'సాధారణంగా నాకు రోమ్ కామ్ సినిమాలు నచ్చవు. యాక్షన్, మాస్ చిత్రాలు కావాలి నాకు. కానీ 'ప్రేమలు' సినిమాను థియేటర్‌లో చూస్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఇది తప్పకుండా థియేటర్‌లోనే చూడాల్సిన చిత్రం' అన్నారు దర్శకుడు రాజమౌళి. కామెడీ, లవ్ అంశాలతో మలయాళంలో రూపొందిన చిత్రాన్ని ఆయన తనయుడు కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజమౌళి మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్‌గా మారిన కార్తికేయను ఆయన అభినందించారు. 'మలయాళంలో కంటే తెలుగులో డైలాగులు బాగున్నాయి. పరీక్షలు ఉన్నాయని ఈ సినిమా చూడడం మానకండి. చిత్రం చూస్తే ఇంకా రిలాక్స్ అయి బాగా చదువుతారు' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. కార్తికేయ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైమ్‌లో ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాం. రచయిత ఆదిత్య , పాటల రచయిత కిట్టు .. ఇలా మేమందరం కలసి వారం రోజుల్లోనే పూర్తి చేశాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మమిత, నస్లేన్, దర్శకుడు గిరీశ్, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకాక్‌లో యాక్షన్ స్టార్ట్



ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం బ్యాంకాక్‌లో నాగార్జున, ఇతర నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలు, యాక్షన్ పార్ట్ చిత్రీకరిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇంతవరకూ ఎవరూ చూడని అద్భుత లొకేషన్స్‌లో జరుగుతుందని నిర్మాతలు చెప్పారు. రష్మిక కథానాయికగా నటిస్తున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.



హను-మాన్ టీమ్‌కు ప్రశంసలు

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుంచి ఉద్భవించిన సూపర్ హీరోలను అద్భుతంగా చూపించి విజయం సాధించిన 'హను-మాన్' చిత్రం టీమ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. పార్టీ సమావేశంలో పాల్గొనడం కోసం హైదరాబాద్ వచ్చిన అమిత్ షాను 'హను-మాన్' చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ, నిర్మాత నిరంజన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హనుమంతుడి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' కూడా విజయం సాధించాలని అమిత్ షా ఆకాంక్షించారు.

ఫికర్ మత్ కరో అనిపించాలి

ఆర్. నారాయణమూర్తి



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ మంగళవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, దర్శకుడు త్రినాథరావు నక్కిన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'ఈ సినిమాలో సాయిరామ్ శంకర్ 'ఫికర్ మత్ కరో' అనే డైలాగ్ చెబుతుంటారు. ఆయన అందరి నోట 'ఫికర్ మత్ కరో' అనిపించాలి' అని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశ్ పూరి మాట్లాడుతూ 'మా బాబాయ్‌లోని ఎనర్జీ ఎక్కడా లేదు. 'బంపర్ ఆఫర్'లో ఆ ఎనర్జీని చక్కగా చూపించారు. దానికి మించి ఈ సినిమాలో చూస్తారు' అన్నారు. 'దర్శకుడు నవీన్ కథ చెప్పగానే నచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌కు సూట్ అవుతూనే మంచి పాయింట్‌తో కథ రాసుకున్నారని అనిపించింది. నాకు కమ్ బ్యాక్ మూవీ అవుతుంది' అని చెప్పారు సాయిరామ్ శంకర్. దర్శకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 'మా నిర్మాత సపోర్ట్‌తో 34 రోజుల్లోనే సినిమా పూర్తి చేశామని నిర్మాత దేవరాజ్ కోరారు.

హై యాక్షన్ ప్యాక్డ్ మూవీ



శివకార్తికేయన్ హీరోగా ఏ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ రెండో షెడ్యూల్ మొదలైంది. చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది బిగ్ బడ్జెట్ చిత్రమనీ, ఇంతకు ముందు నటించిన చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన కనిపిస్తారనీ నిర్మాతలు చెప్పారు. కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో హై యాక్షన్ ప్యాక్డ్‌గా తయారవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. సుదీప్ ఎలామన్ సినిమాటోగ్రాఫర్.

రాజావారు రాణిగారి పెళ్లిసందడి



రాజావారు రాణిగారు చిత్రంతో హీరో హీరోయిన్లుగా తెలుగు తెరకు పరిచయమైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ జంట నిజజీవితంలోనూ ఒక్కటవబోతోంది. ఆ సినిమా సమయంలోనే ప్రేమలో పడిన ఈ జంట త్వరలోనే పెళ్లిపీటలెక్కబోతోంది. హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో బుధవారం వీరిద్దరి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఉంగరాలు మార్చుకున్నారు. వీరి నిశ్చితార్థం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

స్వచ్ఛమైన ప్రేమకథ లంబసింగి

నవీన్ గాంధీ



భరత్‌రాజ్ హీరోగా, దివి హీరోయిన్‌గా నటించిన 'లంబసింగి' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ 'ఒక స్వచ్ఛమైన ప్రేమకథను సహజంగా చూపించాలని 'లంబసింగి' చిత్రం తీశాను. కొత్తవారయితేనే బాగుంటుందని నూతన నటీనటులతో రూపొందించాం. సినిమాలో ప్రతి పాత్ర రియలిస్టిక్‌గా ఉంటుంది. లంబసింగి అనే ఏజెన్సీ ప్రాంతంలో 50 రోజుల పాటు సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ చేశాం. ఇలాంటి ప్రేమకథలకు సంగీతం ప్రధానం. అందుకే పాటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌తో చేయించాం. అన్ని పాటలు మంచి ఆదరణ పొందాయి' అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సొంతంగా బేనర్ స్టార్ట్ చేసి కథలు వింటున్నారని తెలిసి ఆయన్ని కలిశాననీ, తను చెప్పిన కథ ఆయనకు నచ్చిందనీ నవీన్ గాంధీ తెలిపారు. అయితే కరోనా కారణంగా షూటింగ్ ఆలస్యంగా మొదలైందని చెప్పారు.

పతంగ్ పాట



పతంగుల పోటీ నేపథ్యంలో తెలుగులో తెరకెక్కిన తొలి క్రీడా నేపథ్య చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. గాయకుడు ఎస్పీ చరణ్ కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'హే హలో నమస్తే' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ విడుదల చేశారు. చిత్రబృందానికి ఘన విజయం దక్కాలని చంద్రబోస్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి జోస్ జిమ్మీ సంగీతం ప్రధాన బలం అని నిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Q0IoNHD
లో చదవండి.

యూత్ టీమ్‌తో ఫైటర్ రాజా



రామ్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రలు పోషించే 'ఫైటర్ రాజా' చిత్రం ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీవిష్ణు లాంచ్ చేశారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా రోజుల తర్వాత ఓ విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లు తనికెళ్ల భరణి చెప్పారు. రియలిస్టిక్‌గా ఉంటూ యూత్‌ను ఆకట్టుకొనే చిత్రమిదని ఆయన తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన దినేశ్ యాదవ్ బొల్లెబోయిన మాట్లాడుతూ 'యంగ్ టీమ్‌తో నిజాయితీగా ఈ చిత్రం తీస్తున్నాం' అని చెప్పారు. 'నా తొలి సినిమా 'పచ్చీస్' కొవిడ్ కారణంగా ఓటీటీలో విడుదలైంది. కానీ 'ఫైటర్ రాజా' థియేటర్లలో సందడి చేస్తుంది' అని హీరో రామ్ చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీకి మద్దతుగా నిలవండి

- అన్ని విధాల అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి13: గురజాల నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు రజకులు, వడ్డెర సామాజికవర్గం కూడా టీడీపీకి, తనకు వెన్నంటే ఉన్నారన్న విషయాన్ని గుర్తుచేస్తూ రేపటి అధికారంలోకి వచ్చాక వారికి అన్నివిధాల అండగా వుంటామని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానికంగా ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దాచేపల్లిలో ఎకరం స్థలం కేటాయించామని, పిడుగురాళ్లలో 85 సెంట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పిడుగురాళ్లలో 85 సెంట్లు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. దాచేపల్లి, పిడుగురాళ్లలోనే కాకుండా అవసరమైన చోట కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని అన్నారు. అదేవిధంగా చదువుకున్న యువతకు యూత్ పాలసీ ద్వారా స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెడతామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోపాటు గురజాల నియోజకవర్గంలో తాను సొంతంగా తీసుకురానున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతారన్నారు. మట్టపల్లి లక్ష్మీనర సింహస్వామి దేవాలయం ముదిరాజుల సత్రంలో వంటసామగ్రి కొనుగోలుకు రూ.16 వేలకు పైగా నగదును అందజేసిన యరపతినేని శ్రీనివాసరావును ఈ సందర్భంగా సంఘ సభ్యులు సత్కరించారు. సమావేశంలో రొండి శేషయ్య, కారుకోళ్ల నాగరాజు, గొర్రె హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, ఎం.శివ, ఎన్.నరసింహారావు, బి.శ్రీనివాసరావు, ఎం.గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

నకరికల్లు, మార్చి 13 : నకరికల్లు మండలం చల్లగుండ్ల శివారు సున్నం బట్టీ సమీపంలో గల దాబాలో రైడీషీటర్‌ను మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు కత్తులు, మారణాయుధాతో బుధవారం రాత్రి నరికి చంపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన చెరవల్లి మణికంఠ (27) వృద్ధురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. దొంగతనం కేసుల్లోనూ మణికంఠ నిందితుడిగా ఉన్నాడు. రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో మణికంఠపై రౌడీషీట్ నమోదైంది. బుధవారం రాత్రి మణికంఠ సున్నం బట్టీ సమీపాన గల ఓ దాబాలో టిఫన్ చేసేందుకు రాగా ప్రత్యర్థులు మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వచ్చి కత్తులు, మారణాయుధాలతో మణికంఠను హత్యచేశారు. ఒక మహిళతో వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్, నకరికల్లు ఎస్‌ఐ వి.రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పుడు తలెత్తుకుని జీవిస్తున్నాం..

- రోడ్డు మీద చెత్త ఏరుకొంటూ జీవించే వాళ్లం
- స్వచ్ఛత ఉద్యమి యోజన ద్వారా లబ్ధి పొందాం
- ప్రధానితో ముఖాముఖీగా మాట్లాడిన ఆదిపూడి ముత్తమ్మ


వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ


ప్రధాని తో మాట్లాడుతున్న లబ్ధిదారు ముత్తమ్మ

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సార్... మా కుటుంబ సభ్యులు రోడ్డు మీద చెత్త ఏరుకొని బతికేవాళ్లం. రోడ్డు మార్జిన్‌లో ఎండనక వాననక నాభర్త, ఇద్దరు పిల్లలతో జీవించాను. స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం ద్వారా లబ్ధి పొంది ఇక్కడకు వచ్చి మాట్లాడే స్థాయికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అని కాకుమానువారి తోటకు చెందిన ఆదిపూడి ముత్తమ్మ వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెనుకబడిన తరగతుల ఔట్ రీచ్ కార్యక్రమంలో ముత్తమ్మతో ముఖాముఖిగా సంభాషించారు. ముత్తమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛత ఉద్యమీ యోజన పథకం ద్వారా డీసిల్టింగ్ వాహనం (సెప్టిక్ ట్యాంక్)కు ఎంపికవ్వటంతో చాలా సంతోషం వచ్చిందన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ అందించిన తరువాత నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నాని తెలిపారు. నేను డ్రైవింగ్ నేర్చుకొని సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని స్వయంగా నడుపుకుంటూ మరింతగా వృద్ధి చెందుతానన్నారు. నెలకు రూ.10 వేలు ఆదాయం పొందుతున్నానని తన సంతోషాన్ని ప్రధానితో పంచుకొన్నారు. .

తొలుత గౌరవ ప్రధాన మంత్రి పీఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను, అణగారిన వర్గాలు ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీలకు రుణాల మంజూరు పథకాన్ని, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీని రిమోట్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ లబ్ధిదారు ఆదిపూడి ముత్తమ్మతో మాట్లాడుతూ మరో ఐదు ఏళ్లలో వెనుకబడిన, పేదవారి అభ్యున్నతికి మరిన్ని పథకాలు విస్తృత స్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గంధం చంద్రుడు, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ హర్షవర్ధన్, సామాజిక న్యాయ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్, ఎస్ఎస్ఎఫ్‌సీ - స్త్రీనిధి రుణాలు, పీఎం-సూరజ్ యూఎస్‌వై పథకం ద్వారా 218మంది డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రూ.1,33,51,900 చెక్కును, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ డీజీఎం సవన్ బారువా, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల సహాయక కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, డీఆర్డీఏ పీడీ హరిహర నాథ్, ఎన్ఎస్ కెఎఫ్ డీసీ డిప్యూటీ మేనేజరు సందీప్ గుప్తా, ఎన్ఐ ఎస్‌డీఎఫ్‌సీపీఎంయులు సౌజన్య, మహిమ, ఎన్సీసీ ఎఫ్‌డీసీ, ఎన్ఎస్ ఎఫ్డీసీ, నమస్తే లబ్ధిదారుల, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు పాల్గొన్నారు.


పీఎం సూరజ్ యూఎస్‌వై పథకం చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

మాజీ సీఎం రోశయ్య ఇప్పుడే గుర్తుకొచ్చారా?

- ఆ సామాజికవర్గ ఓట్ల కోసమే ఆగమేఘాలపై విగ్రహం..
- నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

వినుకొండ, మార్చి 13: వైసీపీ నాయకులకు ఐదేళ్ళుగా గుర్తుకు రాని మాజీ సీఎం రోశయ్య ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు గుర్తుకొచ్చారా అని నర్సరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని గంగినేని కళ్యాణ మండపంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రోశయ్య సామాజిక వర్గం ఓట్ల కోసమే రెండ్రోజుల్లోనే ఆగమేఘాలపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ అదే సామాజిక వర్గానికి ఎమ్మెల్యే బొల్లా ఏమి చేశారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడు వాటర్‌గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీరందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తొడలు గొట్టే సంస్కృతి తమది కాదని, అభివృద్ధే మా ధ్యేయమన్నారు. గడిచిన ఐదేళ్ళలో తాను ఎంపీగా ఎవరినీ విమర్శించలేదని, పల్నాడు అబివృద్ధి కోసమే పాటుపడ్డానన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతులను ఎమ్మెల్యే తీసుకొస్తాడా, ఎంపీ తీసుకొస్తాడో తెలుసుకోవాలని బొల్లాను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలకు అనుమతులు రాగా ఒకటి పల్నాడు జిల్లాకు తీసుకొచ్చానని తెలిపారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లాకు వినుకొండ నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పంటకు గిట్టుబాటు ధర అడిగినందుకు రైతును చెప్పుతో కొట్టబోవడమే కాక జైలులో పెట్టించిన దుర్మార్గుడు బ్రహ్మనాయుడని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయని, వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీరిచ్చి, రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, భర్త, కుమార్తెల పరిస్థితి విషమం

తెనాలి, మారీసుపేట మార్చి 13: ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక.. మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేధనకు గురై ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటన తెనాలిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్త, కుమార్తెల పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. స్థానిక నాజరుపేటకు చెందిన విష్ణుమొలకల శివశంకర్రావు, భార్య నాగమణి(45), కుమార్తె హారికలు నివాసం ఉంటున్నారు. పాల వ్యాపారం చేసిన శివశంకర్రావు అది లాభసాటిగా లేకపోవడంతో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో చిన్న కొట్టు తీసుకుని టీ వ్యాపారాన్ని నిర్వహిస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుమార్తెకు తెనాలికి చెందిన వ్యక్తితో ఘనంగా పెళ్లి చేశారు. అయితే కొంత కాలంగా కుమార్తె కాపురంలో కట్నం కోసం వేధింపులు చోటు చేసుకున్నాయి. దానికి తోడు వివాహానికి కట్నకానుకుల కోసం చేసిన అప్పులు పెరిగి, వారి నుంచి ఒత్తిడి కూడా ప్రారంభమైంది. అదనపు కట్నం కోసం తీసుకు రాలేదని అల్లుడు, అతడి కటుంబసభ్యులు తమ కుమార్తెను ఇంటికి పంపించకుండా మానసికంగా, శారీరకంగా చిత్ర హింసలు గురి చేస్తున్నారు. దీంతో శివశంకర్రావు తన కుమార్తెను ఇంటికి తీసుకు వచ్చారు. వరకట్న వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఆరు నెలలుగా కుమార్తె పుట్టింట్లోనే ఉంటున్నది. అదనపు కట్నం తెస్తేనే కాపురానికి రావాలని మధ్యవర్తితో అల్లుడు ఒత్తిడి పెంచడం ప్రారంభించాడు. ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేధనకు గురైన శివశంకర్రావు కుటుంబసభ్యులతో కలసి ఆత్మహత్యకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురూ గుళికలనుతిన్నారు. గమనించిన బంధువులు వారిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి(45) మృతి చెందదింది. శివశంకర్రావు, హారికల పరిస్థితి విషమంగా ఉన్నది.

పోలీసుల నిర్లక్ష్యమే కారణం : నాగమణి సోదరుడు

బావ, అక్క కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని నాగమణి సోదరుడు శీలం రాజా ఆరోపించారు. తమ అక్క కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని శిక్షించాలన్నారు. మరొకరి కుటుంబానికి ఇలా జరగకుండా చూడాలని కోరారు. అయితే పోలీసులు మాట్లాడుతూ ఇరు కుటుంబాల వారు పరస్పరం కేసులు నమోదు చేసుకున్నారని ప్రస్తుతం కోర్టులో ఉన్నాయన్నారు.

హనుమంతుడి విగ్రహం

అత్యంత పురాతనం

నకరికల్లు, మార్చి 13: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో ఉన్న హనుమంతుని విగ్రహం 1591లో ప్రతిష్ఠించినట్లు పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజి హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు శాసనం ద్వారా తెలుస్తుందన్నారు. ఆ నాటి హనుమంత స్వామే నేడు రూపెనగుంట్ల వీరాంజనేయ స్వామిగా భక్తులు పూజిస్తున్నారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న బీజేపీ

- కేంద్రం కనుసన్నల్లోనే చంద్రబాబుకు జైలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వినుకొండటౌన్, గుంటూరు(తూర్పు), మార్చి13: కేంద్రం కనుసన్నల్లోనే సీఎం జగన్మోహన్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ఎటువంటి ఆధారాలు లేకుండా 53 రోజులు జైలులో ఉంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని పంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం బెదిరింపు ధోరణితో దేశంలోనే వివిధ రాజకీయపార్టీలను ఎన్డీఏలోకి చేర్చుకుంటుందని ఆరోపించారు. తెలంగాణలో టీడీపీ పోటీ చేయడాన్ని బీజేపీ అడ్డుకుందని, పార్టీలను బ్లాక్‌మెయిల్ చేసి నితీష్‌కుమార్‌తోపాటు అశోక్‌చౌహాన్ వంటి నాయకులను సైతం బీజేపీలో చేర్చుకొని తాయిళాలు ప్రకటిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీని కూడా బెదిరింపు ధోరణితో తన దారిలో తెచ్చుకునేందుకు లిక్కర్ కేసు పేరుతో బెదిరిస్తున్నారన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి లిక్కర్ మాఫియా కొనసాగిస్తున్నా ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇష్టం లేకపోయిన పొత్తుతో పనిచేసేందుకు సీట్ల పంపకం కూడా జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీ టీడీపీ, జనసేనతోపాటు ఇతర ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రంలోని సమస్యలపై పోరాటాలు చేశామన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఇండియా కూటమితో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తున్నామని అన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులు రాజ్యం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సంద్రపాటి సైదా, బూదాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా సాధారణ సమావేశానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరోసారి మోదీ అధికారంలోకివస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి దేశంలో మనుస్మృతిని ప్రవేశపెడతాడని, పొత్తుల విషయంలో ప్రాంతీయ పార్టీలు పునరాలోచన చేయాలని కోరారు. మతాల మధ్య చిచ్చుపెట్టే సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జంగాల అజయ్ కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

- ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించిన వైసీపీ నేత


సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరుటౌన్, మార్చి13: పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ వేదికలుగా మారుతున్నాయి. మండలంలోని సీతారామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రారంభించటం వివాదస్పదమైంది. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్తగా వెళ్లిన నాటి నుంచి పొన్నూరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం మొత్తం అంబటి మురళీకృష్ణ వెంట నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాక్రమంగా నిర్వహించాల్సిన సచివాలయ ప్రారంభం వైసీపీ కార్యక్రమంగా నిర్వహించటం పట్ల ప్రజలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. సీతరామపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్‌ను సైతం ఈ ప్రారంభ కార్యక్రమానికి అధికారులు దూరం పెట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.33
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00


నృసింహాలయంలో పూజలు నిర్వహించిన శివస్వామి

కూటమి విజయాన్ని కాంక్షిస్తూ..

విజయ శంఖారావ యాత్ర

- శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి వెల్లడి..
- లక్ష్మీనృసింహ స్వామి,రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మంగళగిరి సిటీ, మార్చి 13: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించాలని కోరుకుంటూ విజయ శంఖారావం పేరిట యాత్ర నిర్వహిస్తున్నట్లు శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి తెలిపారు. ఈ యాత్రలో భాగంగా బుధవారం ఉదయం ఆయన మఠ పీఠాధిపతులతో కలిసి మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివస్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అయోధ్యలో బాలరాముడి దివ్య ప్రతిష్ఠతో భారతీయుల్లో చైతన్యం వెల్లివిరుస్తోందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 375నుంచి 400 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకోవాలని, ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఘనవిజయం సాధించాలని, మంగళగిరిలో ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న నారా లోకేశ్ భారీ ఆధిక్యంతో గెలుపొందాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు విశ్వధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విజయ శంఖారావ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. తొలిదశలో తెనాలి రోడ్డులోని వరసిద్ధి గణపతి, విజయవాడ కనకదుర్గమ్మ, మంగళగిరి నృసింహస్వామి, రాజధాని రైతుల శిబిరాన్ని సందర్శించినట్లు తెలిపారు. రెండో విడతలో శుక్రవారం నుంచి గుంటూరు బృందావన గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి, త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీశైలం మల్లన్న క్షేత్రాలను దర్శిస్తామన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి జానకీదేవి, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, శైవ క్షేత్రం మఠ పీఠాధిపతులు పాల్గొన్నారు.


మందడం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

- 1548వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు మార్చి 13: అమరావతే ఐదు కోట్ల మంది తెలుగు ప్రజల రాజధాని అని, మూడు రాజధానులనే ఆలోచనను సీఎం జగన్‌రెడ్డి మానుకోవాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1548వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తిచేసి ఉంటే యువత బయట రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేయాల్సి వచ్చేది కాదని, వందల కంపెనీలు అమరావతిలో ఉండి ఇక్కడ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉండేవారని అన్నారు. కేంద్రరంగ సంస్థలకు రాజధాని అమరావతిలో స్థలాలు కేటాయించి ఉండగా, వాటి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించికపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం అమరావతిపై కక్ష ఎందుకు పెంచుకున్నారో తమకు అర్థం కావటం లేదన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్ర భవిషత్ ఆశాజనకంగా ఉండదన్నారు. అమరావతితోనే ఉజ్వల భవిషత్ అన్నారు. కాని జగన్‌రెడ్డి డిక్షనరీలో అభివృద్ధి అనే పదం లేనేలేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలతో పాటు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

'యువత మేలుకో - చంద్రన్నను ఎన్నుకో' లఘుచిత్రం ఆవిష్కరణ

తుళ్లూరు గ్రామానికి చెందిన తరిగోపుల హరీష్ రూపొందించిన 'యువత మేలుకో -చంద్రన్నను ఎన్నుకో..' అనే లఘుచిత్రాన్ని బుధవారం తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు ఆవిష్కరించారు. టీడీపీఫోరం సింగపూర్(ఐటీ) ఎంప్లాయిస్ ఈ లఘుచిత్రాన్ని నిర్మించారు. ఈసందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ 'అరాచకాన్ని అంతం చేద్దాం.. అభివృద్దిని ఎన్నుకుందాం' అనే నినాదంతో ఈ లఘుచిత్రాన్ని నిర్మించామన్నారు. హరీష్ మాట్లాడుతూ షోషల్ మీడియా ఛానెల్స్‌లో మంగళవారం ఈ చిత్రాన్ని రిలీజ్ చేయగా 24గంటల్లోనే లక్ష మంది యూ ట్యూబ్‌లో చూశారని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, రైతులు, జేఏసీ నేతలు కాటా అప్పారావు పాల్గొని చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

1,41,742 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,20,628 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,41,742 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,744 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	19500
నెంబరు. 5	10000	17000
273	11000	14500
341	9500	19000
4884	9000	14000
సూపర్ 10	11500	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	19000
దేవనూరు డీలక్స్	10000	20500
తెల్లకాయలు	5000	12500

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



పిడుగురాళ్లలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు : యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 13: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు సజావుగా అందుతాయని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని 24, 26 వార్డుల్లో బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకాలన్నీ కొందరికే అందజేశారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని గుర్తుచేశారు. యరపతినేనికి పార్టీ నేతలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, కనిగిరి శ్రీను, ఎస్ఆర్ఎంటి సుబ్బారావు, నల్లపాటి నెహ్రూ, తాళ్ల వాసు, కామిశెట్టి రమేష్, మునగా వెంకట్, ఖాశింసైదా, చల్లగుండ్ల శ్రీను, వివి నాగేశ్వరరావు, పణితి రవి, పిల్లి చెన్నారావు, చల్లగుండ్ల సీత, కోకాటి శారద, తాళ్ల నిర్మల, కోమటినేని లక్ష్మీ, దియ్యా విజయ, లింగావతి, చల్లా అంజమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఆర్యవైశ్య యువత

పిడుగురాళ్ల, మార్చి 13 : గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల వ్యాపార సంస్థలెన్నో నష్టపోవడంతో పాటు ఆర్థికంగా కుంగుబాటుకు గురికావడం తమ సామాజికవర్గాన్ని కలచివేసిందని పట్టణానికి చెందిన ఆర్యవైశ్య యువత ఆవేదన వ్యక్తం చేస్తూ వైసీపీని వీడి బుధవారం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. దాచేపల్లి మధుబాబు, యక్కల అనిల్, కొత్త కిరణ్‌కుమార్, వెచ్చా నాగేశ్వరరావు, ఆదివిష్ణు, గజవల్లి గంగాధర్, కొత్త రమేష్, కొత్త కిరణ్‌కుమార్, బూరెల సైదారావు, కొత్త అమరలింగేశ్వరరావు, గ్రంధి వెంకటేష్, ఏలూరి సాయి, శివ, చీదెళ్ల సంతోష్‌కుమార్, మారం రామసుబ్బారావు, చింతా హనుమంతరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, బొబ్బిలి కృష్ణారావు, గ్రంధి గోపితో కలిపి మొత్తం 30 కుటుంబాలకు చెందిన వారు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. యరపతినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక వ్యాపారులకు అండగా వుండటంతో పాటు వారి వృత్తులలో ఇతరుల జోక్యం లేకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కోట హరి, వల్లంబొట్ల నాగేశ్వరరావు, ఎస్ఆర్ఎంటి సుబ్బారావు, చేగు రమేష్, గోళ్ల కిరణ్, పలుచూరి ధనుంజయ, కొత్త పాండురంగ, మోదడుగు హరనాథబాబు, నీరుమళ్ల సత్యనారాయణ, బూరెల అనిల్, భవిరిశెట్టి రాజా, మోటమర్రి శ్రీను పాల్గొన్నారు.

● మాచవరం, మార్చి 13 : మాచవరంలో గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో వైసీపీ మాచవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ దావల్సా, షేక్ జాని, కట్టెబోయిన కోటేశ్వరరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, నక్కా కొండలుతో పాటు 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మాచవరంలో యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో మంగళవారం రాత్రి టీడీపీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు యడ్లపల్లి రామారావు, చల్లాపల్లి నరసింహారావు, కొల్లి కృష్ణమూర్తి, కాశిమళ్ల శౌరిబాబు, మస్తాన్‌వలి, పసులూరి రామయ్య తదితరులున్నారు.

కరాలపాడులో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పిడుగురాళ్ల, మార్చి 13 : కరాలపాడు ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు, మహిళలు సూపర్ సిక్స్ పథకాలపై బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంకుల వెంకటేశ్వర్లు, యలమందారెడ్డి, మంగిరెడ్డి, పాదర్తి రాజేశ్వరి, కొత్త గోపాల్, యాదాల రాజశేఖర్, వట్టెపు సురేష్, రాజబాబు, సాంబయ్య, కోటయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలు సాగు చేయాలి

పిడుగురాళ్ల, మార్చి 13: జిల్లాలో వాణిజ్య పంటలైన పత్తి, మిరప పంటలు అధికంగా సాగుచేసే అవకాశం వుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ తెలిపారు. బుధవారం పిడుగురాళ్లలో ఖరీఫ్ 2024కు ప్రణాళిక ద్వారా విత్తన, ఎరువుల సరఫరాపై విత్తన ఉత్పత్తిదారులు, పంపిణీదారులు, డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి, పల్నాడు జిల్లా విత్తన సంఘం అధ్యక్షులు హనిమిరెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారి సిహెచ్ రవికుమార్, జిల్లాలోని ఆరు సబ్‌డివిజన్‌ల ఎడిఇలు, ఎఓలు, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానాన్ని కల్పించింది టీడీపీయే

దాచేపల్లి, మార్చి 13 : పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీసీల అభివృద్ధికి పాటుపడింది తెలుగుదేశం పార్టీయేనని యరపతినేని సాయినిఖిల్ అన్నారు. దాచేపల్లిలోని ముత్యాలంపాడు రోడ్డులో బుధవారం టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సాయినిఖిల్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో బలహీనవర్గాలకు సముచిత స్థానాన్ని ఇవ్వడంతో పాటు వారిని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వేముల కృష్ణ, 6వ వార్డు కౌన్సిలర్ వేముల జయమ్మ, మాజీ ఎంపీటీసీ గుంజా పూర్ణ, బత్తుల రాంబాబు, గుంజా నాగరాజు, నలబోతుల శివ, బత్తుల హనుమంతు, బత్తుల నరసింహారావు, వేముల కిషోర్, దేవళ్ల వీరయ్య, వేముల చంద్రం, గోవిందరాజు, తదితరులున్నారు.

తంగెడలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు

దాచేపల్లి, మార్చి 13 : రాష్ట్ర పోలీసు చెక్ పోస్టు ఏర్పాటులో భాగంగా బుధవారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామ శివారు కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి వద్ద పోలీసుల చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ సహకారంతో రెండున్నర లక్షల రూపాయలతో నిర్మించిన ప్రత్యేక షెడ్డును దాచేపల్లి సీఐ సురేంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవ్య సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరాజు, యూనిట్ హెడ్ బాబా ఫక్రుద్దీన్, దాచేపల్లి ఎస్ఐలు సంధ్యారాణి, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ

పిడుగురాళ్ల, మార్చి 13: స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లా సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన త్యాగాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, రేపాల శ్రీనివాసరావు, భవనాశి యల్లారావు, కొమ్ము ముక్కంటి, ఎండి గఫార్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాగునీటికీ తారతమ్యమే

● దాహార్తి తీరాలంటే వైసీపీ అభిమానులవ్వాల్సిందే
● యరపతినేని సొంత నిధులతో ట్యాంకర్లు ఏర్పాటు



యరపతినేని ఏర్పాటు చేసిన ట్యాంకరు ద్వారా అందిస్తున్న తాగునీరు

గురజాలటౌన్, మార్చి 13 : ఓ పక్క ఎండలు మండుతున్నాయి.. పట్టణంలోని వార్డులు, గ్రామాల్లోని బోర్లు అడుగంటాయి.. ప్రజల గొంతెండుతోంది.. బోర్ల నుంచి చుక్క నీరూ రావడం లేదు.. దాహం తీర్చండి మహాప్రభో అని మొరపెట్టుకుంటే అధికార పార్టీ వారికి మాత్రమే తాగునీరంటూ తెగేసి చెబుతున్నారు.. దీంతో ప్రతిపక్ష పార్టీ బలంగా ఉన్న వార్డులు, గ్రామాల్లోని ప్రజలు బిందెడు నీటికి అల్లాడిపోతున్నారు.. పంచాయతీ అధికారులేమో నిధులు లేవంటూ చేతులెత్తేశారు.. చలించిపోయిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని తన సొంత నిధులతో తనను, పార్టీని నమ్ముకున్న వారి దాహార్తిని తీరుస్తున్నారు.. మండలంలో నెలకొన్న అధికార పార్టీ అకృత్యంలోకి వెళ్తే...

ఎమ్మెల్యే స్టిక్కరుంటేనే..

మండుతున్న ఎండలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోర్లు అడుగంటాయి. వారం రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఎస్సీ కాలనీ, లక్ష్మీటాకీస్, కట్టెల అడితి, మసీద్ సెంటర్, రెడ్డిబండ సెంటర్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. పట్టణంలో ప్రభుత్వ బోరు నుంచి వైసీపీకి చెందిన మూడు ట్యాంకర్లు వైసీపీ అభిమానులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మాత్రమే వెళ్తున్నాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన సొంత నిధులతో మూడు ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ఈ ట్యాంకర్లకు ప్రభుత్వ బోరు నుంచి నీటిని అందించడం లేదు. కేవలం ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి స్టిక్కర్ ఉన్న ట్యాంకర్లకు మాత్రమే నీటిని ఇస్తామని వైసీపీ నేతలు ఖరాఖండిగా చెబుతున్నారు. దీంతో టీడీపీ నేతలు ప్రైవేటు వ్యక్తుల బోర్ల నుంచి నీటిని ట్యాంకర్లకు పట్టుకొని రాజకీయ పార్టీల తారతమ్యం లేకుండా అందరికీ నీటిని అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సమాధానంపేట, గొట్టిముక్కల, దైద, తేలుకుట్ల, పులిపాడు గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. పంచాయతీ అధికారులు నిధులు లేవంటూ చేతులెత్తేశారు. యరపతినేని ఆయా గ్రామాలకు ఏడు ట్యాంకర్ల ద్వారా సొంత ఖర్చుతో వ్యవసాయ బోర్లు, ప్రైవేటు వ్యక్తుల బోర్లు నుంచి నీటిని అందిస్తున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యేపై ప్రజలు మండిపడుతున్నారు. పట్టణం, గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంటే చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటిని అందించడంలోనూ రాజకీయం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. కాగా యరపతినేని తన సొంత నిధులతో పార్టీలకు అతీతంగా దాహార్తి తీరుస్తున్నారంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలు వెనుక బజారులో ఉన్న మహిళలు సుమారు 20 రోజుల నుంచి నీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతూ బుధవారం మధ్యాహ్నం నగర పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఒక రెస్టారెంట్‌కి ట్యాంకరుతో నీరు సరఫరా చేస్తున్న చిత్రం

రెస్టారెంట్లకి తాగునీరు సరఫరా

కాగా గురజాల నగర పంచాయతీ పరిధిలో నీళ్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే ప్రజలకు నీళ్లు ఇవ్వవలసిన పంచాయతీ సిబ్బంది పట్టణంలోని రెస్టారెంట్లకి తాగునీరు సరఫరా చేస్తుండటం గమనార్హం.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం : చైర్మన్

మాచర్లటౌన్, మార్చి 13 : అందరం కలిసికట్టుగా ఉంటూ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ అత్యవసర సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, కోతుల బెడద అధికంగా ఉన్నాయన్నారు. అనంతరం కౌన్సిలర్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కింద ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు.. ఎంత ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించగా, అజెండాలోని అంశాలన్నీ ఆమోదిస్తున్నట్లు వైసీపీ కౌన్సిలర్లు చెప్పేసి సమావేశం నుంచి వెళ్లిపోయారు. అజెండాలోని 9 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్లు షేక్ తాహినాయత్‌బేగం, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మేకపోతు రామాంజిరెడ్డి, మందా సంతోష్, మున్నా మురళి, మదార్ సాహెబ్, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

విజయపురిసౌత్, మార్చి 13 : మాచర్ల మండలం కొత్తూరులో రూ.43.80 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామం నుంచి ఏడోమైలు వరకు రూ.30 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే ఏడోమైలు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బూడిద శ్రీనివాసరావు, జడ్పీటీసీ మల్లుస్వామి, ఉప ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్‌లు మద్దిగపు అచ్చిరెడ్డి, దేవదానం, సుచియానాయక్, వడితె మంగ్యాబాయి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మం నాయక్, తావుర్యా, మద్దిగపు పాపిరెడ్డి, వెంకట శివారెడ్డి, బంగారెడ్డి పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 13: మండలంలోని గాదెవారిపల్లెలో నూతనంగా నిర్మించిన సొసైటీ గోడౌము, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను బుధవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, జడ్పీటీసీ షేక్ సైదా, వైసీపీ మండల కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, రామారావు, మాజీ ఎంపీపీ శారదా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, మండల అంజిరెడ్డి, డీలర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలి : నేరేటి

విజయపురిసౌత్, మార్చి 13 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు. మాచర్ల మండలం దేశవరంక్యాంపు తండాలో బుధవారం నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, ఎరిపల్లి నరసింహులు, పెంటిబోయిన నూకరాజు, రామ్‌చంద్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ నేతలపై దాడులు

వెల్దుర్తి, మార్చి 13 : వైసీపీ నేతలు ఓటమి భయంతోనే టీడీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. టీడీపీ నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుపై వైసీపీ నేతల దాడిని ఆయన బుధవారం ఖండించారు.

కౌన్సిలర్ ఇంటి సమీపంలో బోరు ఏర్పాటుపై మహిళల ఆందోళన

మాచర్లటౌన్, మార్చి 13 : పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో కౌన్సిలర్ రమణ ఇంటి సమీపంలో పురపాలక సంఘ ఆధ్వర్యాన బుధవారం బోరు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు కొబ్బరికాయ కొట్టి బోరు ఏర్పాటు పనులను ప్రారంభించారు. అయితే ఈ బోరు ఏర్పాటు పట్ల మాజీ కౌన్సిలర్ లెనిన్‌బాబు ఆధ్వర్యాన మహిళలు ఆందోళన దిగారు. కౌన్సిలర్ ఇంటి వద్దకు చేరుకొని తాగునీరు ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతంలో బోరు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. ధర్నా చేసేందుకు మహిళలు ప్రయత్నించగా ఈలోగా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దీంతో మహిళలు చేసేది లేక వెనుదిరిగి వెళ్లారు.

తెలుగు మహిళా జిల్లా కార్యదర్శిగా అనురాధ

మాచర్ల రూరల్, మార్చి 13 : తెలుగు మహిళా జిల్లా కార్యదర్శిగా మాచర్లకి చెందిన పచ్చిపాల అనురాధ నియమితులయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఈ మేరకు బుధవారం నియామక ఉత్తర్వులు పంపారు. అలాగే ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మాచర్ల వాసు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులుగా సాతులూరి కృష్ణ, జంగాల సునీల్, టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ మొహమ్మద్ యూనస్‌బ్‌లు నియమితులయ్యారు.

తక్కెళ్లపాడు టీడీపీ మహిళా కార్యకర్త మృతి

దాచేపల్లి, మార్చి 13 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పని చేసిన మామిడి అక్కమ్మ (85) బుధవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న టీడీపీ సీనియర్ నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, బెల్లంకొండ భద్రి, నర్రా పుల్లయ్య, వేముల తిరుమలకుమార్, చింతపల్లి హసన్ అహ్మద్, రుద్రాల అచ్చారావు, అక్కినపల్లి బాలయ్య, షేక్ మహ్మద్ రఫీ, కోరె రామారావు, పురంశెట్టి పరంజ్యోతి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పెదకూరపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో పోలీసుల కవాత్

పెదకూరపాడు, మార్చి 13 : పెదకూరపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో పోలీసులు కవాత్‌ను నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు వచ్చాయని ఎస్ఐ వీ.వెంకటరావు అన్నారు.

బయటపడిన మంత్రి విడదల రజిని అవినీతి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, మార్చి 13 : చిలకలూరిపేట నియోజకవర్గంలో మంత్రి విడదల రజిని అవినీతి రూపం బయటపడిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించేందుకు ఆ పార్టీ నేత వద్దే కోట్లాది రూపాయలు తీసుకున్నారంటే మంత్రిగా ఇక ఎంత అవినీతికి పాల్పడ్డారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అవినీతిపరురాలైన రజినీని సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి సమర్థించటం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో ఇలాంటి అవినీతి మంత్రులను, వైసీపీ పాలనను అంత మొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

సత్తెనపల్లి నేతలకు సీఎంవో పిలుపు

సత్తెనపల్లి, మార్చి 13 : నియోజకవర్గంలోని వైసీపీ ముఖ్య నేతలకు సీఎంవో కార్యాలయం నుంచి బుధవారం పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ నేతలు అరిమండ వరప్రసాదరెడ్డి, జీ.నాగభూషణరెడ్డి కూడా సీఎంవో కార్యాలయానికి తరలివెళ్లారు. సత్తెనపల్లి వైసీపీ టిక్కెట్ ఊగిసలాటలో ఉన్న నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలతో సీఎం భేటీ కావటానికే పిలిపించారని ఆ పార్టీ నేతల సమాచారం.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

సత్తెనపల్లి, మార్చి 13 : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నేతల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న మురళీకృష్ణ ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు వివిధ అంశాల గురించి మాట్లాడారు. సహాయ ఎన్నికల అధికారులు ఉష, షమ్మి, కే.హరిబాబు, సింగారావులతో పాటు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల నేతలు పాల్గొన్నారు.

గోతులు పూడ్చాలని ఆందోళన

సత్తెనపల్లి, మార్చి 13 : నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు ఉన్న భారీ గోతుల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ తెలుగు యువత ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వక్కంటి అజయ్ కుమార్, చిన్న బోయిన రాఘవ యాదవ్, వడ్డవల్లి వలి, మక్కపాటి రవిచంద్ర, కోట జోసెఫ్, నోముల ప్రకాష్, షేర్ ఆలీ, రామచంద్ర, గణేష్, షేక్ గౌస్, సుబ్బు, దేవరాజు, కాలేషా, ఉమర్ అహమ్మద్, మహమ్మద్ రఫీ, షేక్ బాసు, షేక్ అల్తాఫ్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

నేడు తక్కెళ్లపాడుకు ఎంపీ లావు, యరపతినేని రాక

దాచేపల్లి, మార్చి 13 : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం రానున్నారు. జనసేన కార్యకర్త కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ గ్రామ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా నాయకులు హాజరవుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసరావు యాదవ్‌లు ముఖ్యఅతిధులుగా హాజరుకానున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : తహసీల్దార్

రెంటచింతల, మార్చి 13 : రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని, ఘర్షణలకు పాల్పడి అశాంతిని రేకెత్తించవద్దని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్.రామమోహనరావు కోరారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన తుమ్మకోట, మంచికల్లు గ్రామాల్లో బుధవారం పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆయన వెంట ఆర్ఐ కాంతారావు, సెక్టోరల్ ఆఫీసర్స్ పి.సుధాకరరావు, కె.నరేంద్రారెడ్డి,వీఆర్వోలు మల్లికార్జునరెడ్డి, బాలయ్య, పోలీసు విభాగానికి చెందిన సైదారెడ్డి పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించాలి

బెల్లంకొండ, మార్చి 13 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. తెలుగు యువత నాయకుడు సలాం, సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ మునగపాటి సుభానీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, ఓర్సు ఆనంద్, గుడిసె కొండయ్య, హుస్సేన్, పీఎస్‌కే రసూల్, ఎన్.పిచ్చయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారుపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

క్రోసూరు, మార్చి 13 : జ్వరాలు వ్యాప్తి చెందిన పారుపల్లిలో బుధవారం 27 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి జ్వరాలు ఉన్నట్టుగా తేలిందని, వారిలో ఒక్కరిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాల అంకమ్మ బాయి తెలిపారు. జ్వరాల పరిస్థితి అదుపులో ఉందని ఆమె తెలిపారు. అనుమానితుల నుంచి రక్త నమూనాలు స్వీకరించి పరీక్షల కోసం పంపామని, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్, హెల్త్ ప్రొవైడర్ జ్యోతిర్మయి, రజిని, ఏఎన్ఎం రాజేశ్వరి, పలువురు ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీలో నుంచి టీడీపీలో చేరిన కంటెపూడి ఎస్సీ కాలనీ వాసులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

సత్తెనపల్లి రూరల్, మార్చి 13 : మండలంలోని కంటెపూడి, రెంటపాళ్ల గ్రామాల్లో వైసీపీలో నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. కంటెపూడి ఎస్సీ కాలనీలోని పది కుటుంబాలు వైసీపీ నుంచి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రెంటపాళ్లలో కొమెర శ్రీను ఆధ్వర్యంలో వైసీపీ నుంచి తొర్లకుంట సత్యనారాయణ, తొర్లకుంట వేణు తదితరులు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి కన్నా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎస్సీ సెల్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నాల్గవ తరగతి ఉద్యోగుల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా పని చేసిన కోటిస్వామికి కండువా కప్పి టీడీపీలోకి కన్నా లక్ష్మీనారాయణ ఆహ్వానించారు.

మాగులూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి, మార్చి 13 : సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో మాగులూరి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని విద్యా కేంద్రం కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు బుధవారం పట్టణంలోని ప్రజా వేదికలో రూ.90 వేల ఉపకార వేతనాలను కన్నా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి ప్రకాష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, ప్రసాదు, సిద్దయ్య, టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఆళ్ళ సాంబయ్య, మక్కపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ వైసీపీ అనుబంధ సంస్థా?

● టీడీపీ ఆర్యవైశ్య నేతలు

సత్తెనపల్లి, మార్చి 13 : సత్తెనపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారుల సంఘ సంస్థ లేదా వైసీపీ అనుబంధ సంస్థా అని టీడీపీ ఆర్యవైశ్య నేతలు ప్రశ్నించారు. టీడీపీ ప్రజా వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్‌ని కొంతమంది వైసీపీకి తాకట్టు పెట్టారన్నారు. చాంబర్స్ ఆఫ్ కామర్స్‌లో అన్ని వ్యాపార సంస్థలు, సామాజికవర్గాలు, అన్ని రాజకీయ పక్షాల వారు ఉన్నారన్నారు. అలాంటిది కొంత మంది నాయకుల ఏకపక్ష నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. అంబటి రాంబాబు పాలనలో అనేక మంది ఆర్యవైశ్యులపై కక్ష సాధింపు చర్యలు జరిగాయన్నారు. పలువురు వ్యాపారులను పరోక్షంగా బెదిరింపులకు గురి చేశారన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, నోముల రమణ, జవ్వాజి రామ్మోహనరావు, బచ్చు కొండలు, పోతుగంటి రామకోటేశ్వరరావు, నరసింహారావు, అన్నా సుమన్, శివ ప్రసాదు, అన్నం బాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి : కొమ్మాలపాటి



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, మార్చి 13 : తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో బుధవారం నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి కోసం, పిల్లల భవిష్యత్ కోసం కష్టపడి పని చేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియ జేస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు నందిగం ఆశీర్వాదం, మల్లాది విష్ణువర్ధన్, బత్తుల శ్రీనివాసరావు, పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, వెన్నా వెంకటరెడ్డి, షేక్ కాసుల, ఎడ్లూరి జయరామ్, పాటిబండ్ల బాలయ్య, షేక్ సలాం, తమ్మిశెట్టి సత్యనారాయణ, యడ్లపల్లి బుచ్చిబాబు, సందెపోగు సామేలు, సముద్ర, పాటిబండ్ల పెద్దబ్బాయి, ఏసుపోగు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలిక ప్రాణాలు నిలబెట్టిన కన్నా నాగరాజు

సత్తెనపల్లి, మార్చి 13 : ప్రాణాపాయ స్థితిలో ఉండి మంచానికే పరిమితమైన బాలిక ప్రాణాలు నిలబెట్టి గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు గుంటూరు నగర్ మాజీ మేయర్ కన్నా నాగరాజు. వివరాల్లోకి వెళితే మండలంలోని కట్టమూరు గ్రామానికి చెందిన బడుగు ప్రమీల 10వ తరగతి చదువుతుంది. నెల రోజుల కిందట ఆరోగ్యం పూర్తిగా క్షీణించటంతో గుంటూరులోని పలు ప్రైవేట్ వైద్యశాలల్లో చూపించినా బాలిక ఆరోగ్యం మెరుగుపడలేదు. వైద్య ఖర్చులు భరించలేని స్తోమత బాలిక తల్లిదండ్రులు ఏసుబాబు, సాగరిలకు లేకపోవటంతో ఇంటి వద్దే మంచానికి పరిమితమైంది. ఇటీవల కట్టమూరులో కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలిక పరిస్థితిని గ్రామ నాయకులు నాగరాజుకు వివరించగా స్పందించిన ఆయన బాలికను గుంటూరులోని లలిత ఆస్పత్రికి తరలింపజేశారు. ఆస్పత్రిలోని వైద్యులతో మాట్లాడి ఎంత ఖర్చయినా పర్వాలేదని, తానే భరిస్తానని బాలిక కోలుకోవటం ముఖ్యమని డాక్టర్లకు సూచించారు. నాగరాజు సూచనలు డాక్టర్లు వైద్య సేవలు అందించగా బాలిక కోలుకొని ప్రాణాప్రాయం నుంచి బయట పడింది. బుధవారం రాత్రి గుంటూరు లలిత ఆస్పత్రికి వెళ్ళిన నాగరాజుతో చెలాకీగా మాట్లాడటంతో ఆయన సంతోషం వ్యక్తం చేసి డాక్టర్లను అభినందించారు. తమ కుమార్తె ప్రాణాలను కాపాడిన కన్నా నాగరాజు రుణం ఎప్పుడూ తీర్చుకోనిదని బాలిక తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు.

కన్నా సొంత నిధులతో బోరింగ్ పంపు ఏర్పాటు

నకరికల్లు, మార్చి 13 : నకరికల్లు ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి సమస్యను కన్నా దృష్టికి తీసుకురావటంతో తన సొంత నిధులను వెచ్చించి బోరింగ్ పంపును ఏర్పాటు చేయించారు. మంగళవారం రాత్రి గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు బోరింగ్ పంపులను ప్రారంభించారు. ఎస్సీ కాలనీ వాసులు కన్నా లక్ష్మీనారాయణకు, నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, మార్చి 13 : రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవటం ఖాయమని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

16 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు

క్రోసూరు, మార్చి 13 : పెదకూరపాడు నియోజక వర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 16 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్క దేవాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లాలో 26 దేవాలయాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ దేవాలయాలన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఫిషర్‌మెన్ కాలనీల్లో నిర్మించే విధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ, జనసేన మేనిఫెస్టోపై అవగాహన

అమరావతి, మార్చి 13 : అమరావతిలో బుధవారం తెలుగు మహిళా నేతలు టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మేనిఫెస్టోపై ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎన్‌టీఆర్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, కొమ్మాలపాటి శ్రీధర్ చిత్రపటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగ లక్ష్మి, దేవమణి, సరస్వతి, శివ కుమారి, బాలరాణి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం ద్వారా పేదలకు సేవలు

పెదకూరపాడు, మార్చి 13 : పెదకూరపాడులోని జెండా వద్ద బుధవారం ఎరువుల కొట్టు నిర్వాహకులు షేక్ సలీం బాషా జన్మదినం సందర్భంగా హాసిని మల్టీ స్పెషాలిటీ ఐ హాస్పటల్(మందడం) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, డాక్టర్ రహీం బాషా తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేట టీడీపీ అభ్యర్థిపై ఉత్కంఠ

● డాక్టర్ అరవిందబాబు పేరుపై అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే

● నేడు అభ్యర్థిని ప్రకటిస్తారని ప్రచారం

నరసరావుపేట, మార్చి 13: నరసరావుపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ప్రకటనపై పార్టీ క్యాడర్‌లో ఉత్కంఠ నెలకొంది. గురువారం అభ్యర్థిని పార్టీ అధిష్టానం ప్రకటిస్తుందన్న ప్రచారం. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేరుపై బుధవారం నియోజకవర్గంలో ఐవీఆర్ఎస్ సర్వేను అధిష్టానం నిర్వహించి అభిప్రాయాన్ని సేకరించింది. కొంత కాలంగా బీసీ అభ్యర్థిని బరిలో దింపుతారన్న ప్రచారం జరగుతోంది. బీసీ అభ్యర్థికి అవకాశం ఇస్తే దాదాపు అరవిందబాబు పేరు ఖరారు అవుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. నరసరావుపేట అభ్యర్థి ఎంపికలో డాక్టర్ అరవిందబాబు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్ పేర్లను అధిష్టానం పరిశీలనలోకి తీసుకున్న విషయం తెలిసిందే. అరవిందబాబు 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసి ఓటమిపాలయ్యారు. తనకు మరోచాన్స్ ఇవ్వాలని అధిష్టానం కోరుతున్నారు. మొత్తంమీద బీసీ అభ్యర్థివైపే అధిష్టానం మొగ్గుచూపుతుందన్న ప్రచారం జరగుతోంది. అభ్యర్థి ఎవరన్న అంశపై నెలకొన్న ఊహగానాలకు అధిష్టానం నేడు తెరదింపుతుందని చెబుతున్నారు. రెండో జాబితాను ప్రకటించనున్నట్టు అధిష్టానం ప్రకటించింది.



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

నరసరావుపేట కల్చరల్, మార్చి 13: తొలి మహిళా కవయిత్రి మొల్ల చూపిన మార్గం ఆధునిక మహిళలకు సైతం ఆదర్శనీయమని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. బుధవారం మొల్ల జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్ లోని అంబేద్కర్ స్పందన హాల్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతితక్కువ సమయంలో, సరళ పదాలతో రామాయణం రచించడం మొల్లకే సాధ్యమైందని ప్రస్తుతించారు. పోతన వలె మొల్ల తన రామాయణాన్ని తన ఇష్టదైవానికి అంకితమిచ్చారన్నారు. ప్రాథమిక స్థాయిలో మొల్ల గురించి పాఠ్యాంశాలలో చేర్చాల్సిన అవశ్యకత ఉందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో స్త్రీలు, అణగారిన కులాల పట్ల సమాజంలో ఉన్న వివక్షను ఛేదించుకొని వెలుగు చూసిన నారీమణి తెలుగు మొదటి కవయిత్రి మొల్ల అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీ గాంధీ, రామారావు, సీఐలు ప్రభాకర్, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం ఆధ్వర్యంలో...

వినుకొండ టౌన్, మార్చి13: రామాయణాన్ని తెలుగులో అనువదించిన గొప్ప మహిళ కవయిత్రి మొల్లమాంబ అని కుమ్మర శాలివాహన సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పారెళ్ళ రమేష్ అన్నారు. పట్టణంలోని శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కుమ్మర కల్యాణ మండపంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు పారెళ్ళ రమేష్ మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం శాలివాహన సంఘం అధ్యక్షుడు గొట్టం గోవిందరాజులు, పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, మద్దికుంట ఆదినారాయణ, చిరంపల్లి రామయ్య, కాసరబాద లింగయ్య, రాజవరపు రామాంజినేయులు, పారెళ్ళ సుబ్రమణ్యం, లక్ష్మయ్య, దాసయ్య, చాతిరాజుపల్లి నాగేశ్వరరావు, పాశం నాగమల్లేశ్వరరావు, వెలగపూడి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులో ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా

మహిళలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 13: సమాజంలో మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించాలన్న ఉద్దేశంతోనే సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే కేటాయించి వారికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరులో మహిళలకు ఇళ్ళపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామమైన వేల్పూరును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే రూ.40కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. వేల్పూరుపై ఎక్కువ పక్షపాతం చూపిస్తున్నానని, కొందరు తనను విమర్శించారని, అటువంటి విమర్శలను తాను పట్టించుకోనన్నారు. అనంతరం బాలవికాస సేవాసంస్థ ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఇన్‌చార్జి సర్పంచ్ రత్నగిరి, నేతలు గుత్తా కోటేశ్వరరావు, తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, ముండ్రు రాఘవరావు, గట్టుపల్లి వీరాస్వామి, అలపాటి శివ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

నూజెండ్ల, మార్చి 13: మండలంలోని పమిడిపాడులో గురువారం రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్‌సెంటర్, అంగన్‌వాడీకేంద్రం, మురుగు కాలువలు, జలజీవన్‌మిషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అభివృద్ధికి నిదర్శనంగా ఈ భవనాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి, వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా నాగిరెడ్డి, సర్పంచ్ దాని శివ నాగమల్లేశ్వరి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజేష్ నాయుడుకే టిక్కెట్ ఇవ్వాలని బైక్ ర్యాలీ

● మంత్రి విడదల రజిని డౌన్ డౌన్ అంటూ నినాదాలు

● స్థానికులకే టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్

● పోలీసులకు కార్యకర్తలకు మధ్య తోపులాట



చిలకలూరిపేటలో జరిగిన వైసీపీ కార్యకర్తల ర్యాలీ

చిలకలూరిపేట, మార్చి 13: చిలకలూరిపేట నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా తొలగించిన మల్లెల రాజేష్ నాయుడుకు సంఘీభావంగా వైసీపీ కార్యకర్తలు బుధవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాజేష్ నాయుడు కూడా స్వయంగా పాల్గొన్నారు. మంత్రి విడదల రజిని డౌన్ డౌన్, కావటి మనోహర్ నాయుడు గోబ్యాక్, రాజేష్ నాయుడు నాయకత్వం వర్థిల్లాలి అంటూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. స్థానికులకే చిలకలూరిపేట వైసీపీ టికెట్ ఇవ్వాలంటూ కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీ సందర్భంగా కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక నరసరావుపేట సెంటర్లో ర్యాలీని ఆపాలని పోలీసులు విఫలయత్నం చేశారు. పోలీసుల వైఖరికి నిరసనగా కార్యకర్తలు జాతీయ రహదారిపై కొంతసేపు రాస్తారోకో చేశారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ కేబీ రోడ్‌లోకి వెళ్ళింది. ర్యాలీ కేబీ రోడ్డుకు చేరేసరికి పెద్ద సంఖ్యలో అదనపు పోలీసు బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, అదనపు పోలీస్ బలగాలు ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీ అగ్రభాగాన ఉన్న డీజే సౌండ్ బాక్స్‌తో ఉన్న వాహనాన్ని, ఇతర ద్విచక్ర వాహనాలను అక్కడపెట్టి నడుచుకుంటూ ర్యాలీగా వెళ్లాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ థియేటర్ ప్రాంతంలో పోలీసులకు, ర్యాలీలో ఉన్న కార్యకర్తలకు మధ్య తోపులాట కూడా జరిగింది. ఎవరి వాహనాలు వారికి ఇవ్వాల్సిందేనని రాజేష్ నాయుడు పట్టుబట్టడంతో పోలీసులు సంయమనం పాటించి అందుకు అంగీకరించారు. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ వద్ద పోలీసులు భారీగా మొహరించి విడదల రజిని కుటుంబ సభ్యుల గృహం ఉండే పురుషోత్తమపట్నం మెయిన్ రోడ్డువైపు కార్యకర్తలను వెళ్లకుండా చూశారు. అక్కడి నుంచి ర్యాలీ ప్రశాంతంగా ముందుకు సాగి స్థానిక బ్యాంకు కాలనీలో ఉన్న రాజేష్ నాయుడు కార్యాలయం వద్ద ముగిసింది. కాగా మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై నరసరావుపేట సెంటర్లో స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాజేష్ నాయుడు మద్దతుదారులు ఒక ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టారు.

వినుకొండలో స్వల్ప ఉద్రిక్తత

● ఒకే సమయంలో ఇరు పార్టీల కార్యక్రమాలు

● చర్చనీయాంశమైన వైసీపీ నేతల తీరు



విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బొల్లా, ఎంపీ కృష్ణదేవరాయల ర్యాలీ

వినుకొండ టౌన్, మార్చి 13: వినుకొండ కాల్వ కట్ట వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉద్రిక్తతల నడుమ జరిగింది. ఎటువంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై విగ్రహం ఏర్పాటు పట్టణంలో చర్చనీయాంశమైంది. టీడీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఆ పార్టీ నాయకులతో నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. ఎంపీ రాక సందర్భంగా టీడీపీ నాయకులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీగా వస్తున్న టీడీపీ కార్యకర్తలనుద్దేశించి నూతనంగా ఏర్పాటుచేస్తున్న రోశయ్య విగ్రహావిష్కరణ సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సమావేశంలో బొల్లా బ్రహ్మనాయుడు రేయ్... దమ్ముంటే నన్ను ఎదుర్కోవాలని టీడీపీ నాయకులకు సవాలు విసిరారు. బ్రహ్మనాయుడు ఆవేశపూరితంగా ప్రసంగించారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం ఏర్పాటు ఇష్టం లేకనే టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వెంటనే టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెనను తనతో తీసుకువెళ్ళడంతో టీడీపీ కార్యకర్తలు శాంతించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై పలువురు తీవ్రంగా ఖండించారు. ఈ సమయంలో పట్టణ సీఐ సాంబశివరావు ఇరువర్గాలను అదుపుచేయడంతో శాంతియుత వాతావరణం నెలకొంది.

వైసీపీ నాయకుల కవ్వింపు చర్యలు

వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు ప్రజల్లో ఆ పార్టీపై రోజు రోజుకు వ్యతిరేకతను పెంచుతున్నాయి. బుధవారం సాయంత్రం 5గంటలకు గుంటూరు-కర్నూలు హైవే మార్గంలోని ఎన్నెస్పీ స్థలం వద్దనున్న డివైడర్‌పై ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే బొల్లా కార్యాలయం ముందుగా ప్రకటించింది. సాయంత్రం ఆరున్నరకు నర్సరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు నరసరావుపేట రోడ్డులోని గంగినేని పంక్షన్ హాలులో నియోజకవర్గ నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. బోడెపూడివారిపాలెం సమీపంలోని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గెస్ట్‌హౌస్ నుంచి టీడీపీ కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వినుకొండ పట్టణంలోకి చేరుకొని శివయ్య స్థూపం సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వెళుతున్నారు. ఐదున్నరకు జరగాల్సిన రోశయ్య విగ్రహావిష్కరణను ఉద్దేశపూర్వకంగా ఆరున్నరకు మార్చుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ నాయకులు, పోలీసులతో అక్కడికి చేరుకొన్నారు. అదేమార్గంలో వస్తున్న టీడీపీ ర్యాలీకి ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీసుల వాహనాన్ని అడ్డుపెట్టడంతో ఇరువర్గాల మధ్య చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకొంది. ఈ సమయంలో ఎమ్మెల్యే బొల్లా ఆయన అనుచరులు టీడీపీ నాయకులనుద్దేశించి వ్యంగంగా మాట్లాడడంతో లావు, జీవీ, మక్కెనలు పోలీసులతో మాట్లాడి వాహనాన్ని తీయమని చెప్పి కార్యకర్తలను సమన్వయపరచడంలో సఫలీకృతులయ్యారు. పోలీసులు వాహనం తీయడంతో టీడీపీ ర్యాలీ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఈ సందర్భంగా కొందరు ఎంపీ కృష్ణదేవరాయలుపై వైసీపీ నాయకులు కర్రలతో టీడీపీ కార్యకర్తలపై దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాకుండా స్వయంగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు వినకొండలో టీడీపీ నాయకులు చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, అతని అనుచర వర్గం అక్కడ చేరుకొని కవ్వింపు చర్యలు చేపట్టటంపై చర్చనీయాంశమవుతోంది. గతంలో యువగళం పాదయాత్ర జరిగినప్పుడు బ్రహ్మనాయుడు మీసం మెలేసి తొడకొట్టారు, ఇటీవల వినుకొండ పట్టణంలో టీడీపీ శ్రేణులు నిరసన ర్యాలీ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కారు ఆపి అసభ్య పదజాలంతో టీడీపీ శ్రేణులను దూషించి కవ్వింపు చర్యలకు పాల్పడటంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



కర్రలతో దాడికి యత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, మార్చి 13: చోరీ కేసులో నిందితులైన బాపట్ల జిల్లా ఈపూరిపాలెంకు చెందిన కుంజా లక్ష్మీ, గుంటూరులోని నల్లచెరువుకు చెందిన చిరుమామిళ్ళ యశోదలను అరెస్టు చేసినట్టు నరసరావుపేట మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను బుధవారం పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. నిందితుల వద్ద నుంచి 213 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌కు చెందిన ఫిర్యాది షహనాజ్ ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేశామన్నారు. ఎస్పీ రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ వర్మ పర్యవేక్షణలో సీసీ ఫుటేజ్‌ని పరిశీలించి నిందితులను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. నిందితుల పై మరో పది కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు ఆయన తెలిపారు.

40 ఏళ్ళు దాటిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలి

నరసరావుపేట టౌన్, మార్చి 13: కంటి చూపు కాపాడుకోవడానికి 40 ఏళ్ళు నిండిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ ఎన్ సురేష్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ నీటి కాసుల వ్యాధుల అవగాహన వారోత్సవాలు సందర్భంగా నీటి కాసుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ సురేష్ మాట్లాడుతూ నీటి కాసులు వారోత్సవాలు ఈ నెల 16 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ ఎం మంత్రు నాయక్, డాక్టర్ కే ఏడుకొండలు, ఆర్ఎంవో డాక్టర్ దయానిధి, డాక్టర్ హేమశ్రీ, ఎం.రామకృష్ణ, మురళి, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసుల కవాతు

నరసరావుపేట లీగల్, మార్చి 13: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని కోట సెంటర్, క్రిష్టియన్‌పాలెం, బరంపేటలలో సీఐలు కృష్ణారెడ్డి, ఆవుల బాస్కర్‌ల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.

తెర పైకి ఎంపీపీ వివాదం

రొంపిచర్ల, మార్చి 13: రొంపిచర్ల మండల ఎంపీపీ వివాదం తెరపైకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మునమాక, అలవాల గ్రామాల నుంచి గడ్డం బాలమ్మ, గుండాల నాగమణి గెలిచారు. ఎంపీపీ పదవి విషయంలో తొలినాళ్ళలోనే చెరి రెండున్నర సంవత్సరాలు అని వైసీపీ నేతలు రాజీ కుదిర్చారు. ఈ నెల 20వ తేదీతో మొదటి రెండున్నర సంవత్సరాల గడువు ముగియనుంది. దీంతో గత కొద్దిరోజులుగా గుండాల వెంకటేష్ తన అనుచరులతో తమకు ఎంపీపీ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వద్దకు వెళ్ళారు. ఎమ్మెల్యే కూడా గుండాల వెంకటేష్ సతీమణి ఐన నాగమణికి ఎంపీపీ పదవి కట్టబెట్టేందుకు సుముఖంగా ఉన్నట్టు తెలియవచ్చింది. ఐతే ఎన్నికల సమయం కావటంతో ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● ప్రధానోపాధ్యాయులు గుబ్బ రమణరావు

నరసరావుపేట రూరల్, మార్చి 13: పదో తరగతి విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు గుబ్బ రమణరావు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని బరంపేటలోని హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థి కత్తుల వంశీ కృష్ణ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే 75మంది విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుబ్బ రమణరావు, పఠాన్ కరిముల్లా, పూర్వ విద్యార్థులు షేక్ నూర్ కరిముల్లా, మండా విజయకుమార్, అడపాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు

● మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 13: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ సి.రామచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మార్నింగ్ విజిట్‌లో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ సి.రామచంద్రరెడ్డి 34వ వార్డులోని బరంపేట,స్టేడియం పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడుతూ ప్రతిరోజు పురపాలక సిబ్బంది చెత్త తీసుకు వెళ్లేవాళ్లు వస్తున్నారా, లేదా కాలువలు శుభ్రం చేస్తున్నారా లేదా అని వార్డు ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య 34 వార్డు ఇన్చార్జి ఆదం తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ రౌడీ రాజకీయాలను తరిమికొట్టండి: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మార్చి 13: ఓటుతో వైసీపీ రౌడీ రాజకీయాలను తరిమికొట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. బుధవారం నరసరావుపేట పట్టణంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట గడ్డపై తెలుగుదేశం జెండా ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని అన్నారు. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరగబోయే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గవ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, వాసిరెడ్డి రవీంద్ర, షేక్ మస్తాన్ షరీఫ్, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మాదిగ, ఉపకులాల చైతన్య సదస్సు

నరసరావుపేట టౌన్, మార్చి 13: నరసరావుపేట పట్టణంలో గురువారం షాదీఖానాలో మాదిగ, ఉపకులాల చైతన్య సదస్సు జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ గుండాల ఆనంద మాదిగ బుధవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య హాజరవుతారన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు జేఎన్‌టీయూ విద్యార్థిని ఎంపిక



నరసరావుపేట కల్చరల్, మార్చి, 13. ఈ నెల 14 నుంచి మహారాష్ట్రలోని పూణేలో నిర్వహిస్తున్న సీనియర్ నేషనల్ హాకీ మహిళ చాంపియన్ షిప్ - 2024 పోటీలకు పట్టణంలోని జేఎన్‌టీయూ (ఎన్) కళాశాల విద్యార్థిని అల్లాడి కోమాలిక మన రాష్ట్రం తరపున పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కోమాలిక సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్నది. కాగా తమ కళాశాల విద్యార్థిని జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం హర్షించదగిన విషయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్. కిశోర్ విద్యార్థిని అభినందించారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే గోపిరెడ్డి

రొంపిచర్ల, మార్చి 13: పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు.

అనిల్ కుమార్ యాదవ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, మార్చి 13: అనిల్ కుమార్ యాదవ్ నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నెల్లూరు వైసీపీ నాయకులు మాకొద్దని నరసరావుపేటకు త రిమినా అనిల్‌కు బుద్ధిరాలేదని, నీటిపారుదలశాఖ మంత్రిగా ఏం చేశాడో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా పదవి కోల్పోయి చాలాకాలం అయినా నీటిపారుదల మంత్రిగా మాత్రం నిరంతరాయంగా కొనసాగుతున్నారని అన్నారు. అద్దంకి సిద్ధం సభలో అనిల్‌కుమార్ యాదవ్ విచక్షణ కోల్పోయి టీడీపీ నాయకులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం వజ్రాలపాడులో వరికపూడిశల ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు కేంద్రం నుంచి తానే తెచ్చినట్లు, స్థానిక ఎంపీ ఏమీ చేయనట్లు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడటం ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కుతా అన్నట్లు ఉందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లుగా రాష్ట్రంలో ఒక్క నీటి పారుదల ప్రాజెక్టు పూర్తి చేయకుండా కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారన్నారు. నెల్లూరు జిల్లాలో మెడికల్ మాఫియా నడిపి బ్రెయిన్‌డెడ్ అయిన ఏకొల్లు శ్రీనివాసులు అనే గిరిజనుడి అవయవాలు అమ్ముకున్న నీచచరిత్ర వైసీపీ నాయకులదన్నారు. నెల్లూరు కిడ్నీ రాకెట్‌లో అనిల్ కుమార్ యాదవ్ లేడని నిరూపించగలరా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అనిల్‌కుమార్ యాదవ్ హుందాగా వ్యవహరించాలని సూచించారు.

ప్రత్తిపాటిని కలిసిన సుమన్‌గౌడ్

చిలకలూరిపేట అర్బన్, మార్చి 13: మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావును యువ నాయకుడు సుమన్‌గౌడ్ బుధవారం పుల్లారావు క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రత్తిపాటి గెలుపు కోసం క్రిందిస్థాయిలో పనిచేయటానికి సుముఖంగా ఉన్నామని తెలియజేశారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి



మహేష్ (ఫైల్‌ఫొటో)

వినుకొండ, మార్చి 13: టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనం పై ప్రయాణిస్తున్న యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే కొచ్చర్ల గ్రామానికి చెందిన గుంటూరు మహేష్ స్నేహితులతో కలిసి విఠంరాజుపల్లి నుంచి ద్విచక్రవాహనంపై వినుకొండ వస్తుండగా టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. తనతోపాటు ఉన్న మరో వ్యక్తికి తీవ్రగాయాలవటంతో వినుకొండ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న యడ్లపాడు పాఠశాల విద్యార్థి షేక్ జమీర్

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు జిల్లా ప్రాజెక్టుల ఎంపిక

నరసరావుపేట కల్చరల్, మార్చి 13: ఈ నెల 11 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి ప్రదర్శించిన 13 ప్రాజెక్టులో రెండు ప్రాజెక్టులు జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ సమన్వయకర్త బుధవారం తెలిపారు. క్రోసూరు జై భారత్ స్కూల్‌కు చెందిన షేక్ రేయాన్ తయారుచేసిన సౌరశక్తితో కలుపు మొక్కలు నివారించే యంత్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యడ్లపాడుకు చెందిన విద్యార్థి షేక్ జమీర్ తయారు చేసిన మ్యాన్ హోల్‌ను శుభ్రపరిచే ఆధునిక యంత్రం ప్రాజెక్టులు ఎంపకయ్యాయి. ఈ ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయులు షేక్ ఖాదర్, జి.రాధలు గైడ్‌లుగా వ్యవహరించారు.

కందిపప్పు మిల్లుల్లో అధికారుల తనిఖీలు

వినుకొండ, మార్చి 13: మండలంలోని విఠంరాజుపల్లి సమీపాన ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర దాల్ ఇండస్ట్రీస్ మిల్లును బుధవారం పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీచేశారు. కందిపప్పు మిల్లింగ్ ప్రక్రియ, వివిధ రైతుభరోసా కేంద్రాల ద్వారా రవాణా అయిన కందుల వివరాలను, కందిపప్పు తయారీ విధానాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ విధానాన్ని సమీక్షించారు. అనంతరం మండలంలోని అందుగుల కొత్తపాలెంలో రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సివిల్ సప్లై అధికారి వీరపాండ్యన్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 17,300 హెక్టార్లలో రైతులు కందిపంటను సాగుచేశారని, 25వేల మెట్రిక్ టన్నులు దిగుబడిగా వస్తుందన్నారు. ఇప్పటివరకు 155 రైతు భరోసా కేంద్రాల ద్వారా 3246 మెట్రిక్ టన్నులను 2077 రైతుల నుంచి సేకరించి పల్నాడు జిల్లాలోని దాల్ మిల్లులకు పంపిచామన్నారు పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలలోని మండల స్టాక్ పాయింట్లకు వెయ్యి మెట్రిక్ టన్నుల కందిపప్పును రవాణా చేయడం జరిగిందని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వీటిని స్థిరపరిచామన్నారు. కందుల కొనుగోలు ద్వారా గన్నీలు, కూలీలు, రవాణా చార్జీలు కలపి క్వింటా 9490లుగా ధరను నిర్ణయించడం జరిగిందని, ఈక్రాప్ బుకింగ్ చేసుకొన్న రైతులు రైతుభరోసా కేంద్రాలలో కందులు విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ శ్యాంప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులు కల్పశ్రీ, వరలక్ష్మి, పద్మశ్రీ, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ సొసైటీ ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్ర

నరసరావుపేట కల్చరల్, మార్చి 13: ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ యేడాది జూన్ 25న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమౌతున్నట్లు సొసైటీ పల్నాడు జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ ప్రహ్లాద గుప్తా బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. యాత్రలో భాగంగా అమరనాథ్ మంచులింగ దర్శనంతో పాటు, శక్తిపీఠం వైష్ణోదేవి ఆలయ దర్శనం కూడా ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల వారు 9989508524 నెంబరులో సంప్రదించాలని కోరారు.

శరత్ అక్రమ అరెస్టుకు టీడీపీ కౌన్సిలర్ల నిరసన

చిలకలూరిపేట అర్బన్, మార్చి 13: మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్ అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావుతో పాటు కౌన్సిలర్లు కొత్త కుమారి, రాయిని హరిత, జంగా సుజాత, కనమర్లపూడి లక్ష్మీతిరుమల, కె.కరుణ తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో టీడీపీ, జనసేన జెండాల ఆవిష్కరణ

నాదెండ్ల, మార్చి 13: మండలంలోని గణపవరంలోని మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్‌లో టీడీపీ, జనసేన జెండాలను గ్రామానికి చెందిన నాయకులు బుధవారం ఆవిష్కరించారు. 51 అడుగుల స్తంభంపై టీడీపీ, జనసేన జెండాలను ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, నరసింహారావు, జంపాని వెంకటరత్నం, కాట్రు శ్రీను, రోశయ్య, కంచర్ల శ్రీను, రామయ్య, శేషయ్య, హనుమంతరావు, షేక్ ఖాశిం, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బొగ్గరం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

ఈపూరు, మార్చి 13: మండలంలోని బొగ్గరంలోని స్వయంభు ప్రసన్నాంజేయ స్వామి తిరునాళ్ళ బుధవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తిరునాళ్ళను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామస్థులు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. అదేరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తారు.

నిరాశ్రయుల వసతి గృహంలో వైద్య సేవలు

వినుకొండ, మార్చి 13: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని గేట్ సమీపంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 30వ వార్డు కౌన్సిలర్ షకీల పాల్గొని నిరాశ్రయులకు చేస్తున్న సేవలను గురించి సంస్థ సభ్యులను ప్రశంసించారు. అదేవిధంగా వేసవిలో చల్లనినీరు ఇచ్చే డిస్పెన్సరీని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కౌశిక్, సురేష్, మెప్మా కో ఆర్డినేటర్ ఖాజా, శ్యామల, స్రవంతి, విజయరాణి, డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, విద్యారావు తదితరులు పాల్గొన్నారు.